## క్లుప్తంగా

### ఘనంగా సామూహిక పద్యార్చన



శీలలో సామూహిక పద్యార్చన కార్యక్రమంలో తెలుగు పద్యాలను పఠిస్తున్న చిన్నారులు

**కాజులూరు:** శీల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సామూహిక పద్యార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. తానా (తెలుగు అసోషియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, వేదపండితులు శంకర ప్రియ మాట్లాడుతూ తానా సద్భావన యాత్రలో భాగంగా వందే విశ్వమాతరమ్ పేరుతో 100 దేశాలలో అమ్మా, నాన్న, గురువు అనే అంశాలపై పద్యార్చన పోటీలు నిర్వహిస్తూ తల్లితండ్రులు, గురువులపట్ల, తెలుగు భాషపై గౌరవాన్ని పెంపొందిస్తున్నారన్నారు. తానా సభ్యుడు చిగురుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పద్యార్చన పోటీల్లో 70 మంది చిన్నారులు పాల్గొని బహుమతులు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎస్ఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు డిఎస్ఎస్ రాజు, ఎస్ సుధాకర్, పి.గోవిందరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నేడు మండలంలో బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ

**రాయవరం:** ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను అందజేసేందుకు మండల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు డిజిటల్ విద్యలో భాగంగా గతేడాది ట్యాబ్స్‌ను పంపిణీ చేశారు. ఈ ఏడాది కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేయనున్నారు. రెండో ఏడాది మొదటి దశలో మండలానికి 290 ట్యాబ్స్ రాగా, రాయవరం-101, సోమేశ్వరం-56, వెదురుపాక-47, పసలపూడి-74, లొల్ల యూపీ స్కూల్‌కు ఐదు ట్యాబ్స్‌ను విద్యార్థులకు అందజేయనున్నట్లు ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణలు తెలిపారు. ఆయా పాఠశాలల వద్ద ప్రజాప్రతినిధుల సమక్షంలో వీటిని విద్యార్థులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

### నేటి చెకుముకి టెస్ట్‌కు 27 బృందాలు

**కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించే మండల స్థాయి చెకుముకి సైన్స్ విజ్ఞాన పరీక్ష రాసేందుకు మండలంలోని 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రైవేటు పాఠశాల నుంచి 27 బృందాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింశెట్టి లెనిన్ బాబు, వాసంశెట్టి శ్రీనివాసరావు బుధవారం ఏర్పాట్లు వివరాలు వెల్లడించారు. ఇటీవల పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన 8,9,10 తరగతి విద్యార్థుల నుంచి మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఒక్కో బందానికి ముగ్గురు విద్యార్థుల చొప్పున 81 మంది పరీక్ష రాయనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు పరీక్ష నిర్వహిస్తామని 27 బృందాల నుంచి ఒక బృందాన్ని జిల్లా పరీక్షకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

### దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలి

**కాజులూరు:** దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మొగలిపాలెంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీరు నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఈ ఏడాది వర్షాలు కారణంగా జాప్యం జరుతుందని కనీసం ఈ నెలాఖరువు నాటికైనా పూర్తి స్థాయిలో వెదజల్లడం, నాట్లు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి అనుషా మాట్లాడుతూ దాళ్వా సాగుకు సమయం తక్కువ ఉందని, రైతులు వెదజల్లే విధానానికి ప్రాధాన్యమిస్తే తక్కువ రోజుల్లో కోతకు వచ్చే పంట రకాల వరిని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వేగిశన వెంకటసుబ్బారావు (శ్రీను), మాజీ ఉపాధ్యక్షులు తాడి వెంకటరెడ్డి, పుల్లైపు వాడపల్లి (పెద్దకాపు), నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

### మండపేటలో అంగన్‌వాడీల భిక్షాటన

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నియోజకవర్గ స్థాయిలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. వేతనాలు, ప్రభుత్వ సదుపాయాలు పెంపు కోరుతూ వారు చేస్తున్న సమ్మె తొమ్మిదో రోజైన బుధవారం కూడా కొనసాగింది. కలువ పువ్వు సెంటర్‌లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి, ప్రాజెక్ట్ నాయకులు సీహెచ్.రాణి, పి.ఆదిలక్ష్మి, ఎం.బేబీ, కృష్ణవేణి, ఎం.జానకీదేవి, సత్యవేణి, పి.కుమారి మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. గురువారం నుంచి నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు ప్రకటించారు.

# విద్యాలయాల్లో చెకుముకి సంబరాలు

- ప్రయోగాత్మక విద్యా విధానానికి పరితపిస్తున్న జేవీవీ
- సైన్స్ ప్రచారంలో మూడున్నర దశాబ్దాల కృషి
- నేడు మండల స్థాయిలో సంబరాలు
- జనవరి 7న జిల్లా, ఫిబ్రవరి 10,11తేదీలో రాష్ట్ర స్థాయి సంబరాలు



చెకుముకి పరీక్షలో సైన్స్ ప్రయోగాలను చేస్తున్న విద్యార్థులు (పాత చిత్రం)

**కపిలేశ్వరపురం:** ఎందుకు? ఏమిటి? ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ఇవన్నీ ప్రశ్నలు...సాధారణ మానవ జీవన విధానంలో వీటికి అంతగా ప్రాధాన్యం ఇవ్వరు. అందుకే అలాంటి వారి జీవితాలు సమస్యల వలయంలో చిక్కుకుంటాయి. సాయం కోసం మరొకరిపై ఆధారపడుతుంటారు. ఈ ప్రశ్నలకు ప్రాధాన్యం ఇచ్చిన వారు తమ జీవితాన్ని క్రమబద్ధం చేసుకుంటారు. ప్రశ్నకు ఉన్న ఆ శక్తిని తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు జన విజ్ఞానవేదిక ప్రతినిధులు. చదువే మనిషికి జీవం రా...అంటూ ప్రకృతి ధర్మాలను సైన్స్ సంగతులను విద్యార్థులకు అవగాహన తెస్తూ ముందుకు సాగుతున్నారు. ఆ సంస్థ ఏటా నిర్వహించే చెకుముకి సంబరాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కథనం.

**శాస్త్రబద్ధ విద్యా విధానం కోసం..**

సమాజంలో వ్యక్తిని ఒంటరిగా కాకుండా మానవుల సమూహంగా మనిషిని ఆవిష్కరించే లక్ష్యంతో విద్యార్థులకు విడిగా కాకుండా బృందంగా జన విజ్ఞాన వేదిక పరిగణిస్తుంది. అందుకే విద్యార్థులకు విడిగా కాకుండా బృందంగా పోటీలను నిర్వహిస్తుంది. దాని ద్వారా సమష్టి ప్రగతి, సమష్టి ఆలోచనా విధానాన్ని విద్యార్థుల్లో అలవాటు చేయాలనే దిశగా చెకుముకి సంబరాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థినీ సంబరాల్లో భాగస్వాములను చేయడంతో పాటు సంబరాలు పేరుతో విద్యార్థుల ఆలోచనలను ఆడుతూ పాడుతూ సైన్స్ మార్గంలోకి తీసుకెళ్లే దిశగా కృషి కొనసాగుతోంది.

**ఒత్తిడిలేని పరీక్ష విధానం...**

పాఠశాల స్థాయిలో రాత పరీక్షగా మొదలైన ఈ ప్రక్రియను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఒత్తిడి లేని పద్ధతుల్లో సైన్స్ సంబరాలు పేరుతో నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్ళిన విద్యార్థులు నేరుగా శాస్త్రవేత్తలతో ఒకరోజు క్షేత్ర పర్యటనతో పాటు, ముఖాముఖి అవకాశం దక్కుతుంది. అందులో భాగంగా పాఠశాలల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయీ పోటీల్లో ప్రతిభను చాటేందుకు సిద్ధపడుతున్నారు.

**జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక ఇలా..**

ఒక్కో పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థుల బృందాలు గురువారం మండల స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఒక్కటి, ప్రైవేటు పాఠశాల నుంచి ఒక్క బృందాన్ని మొత్తం రెండు బృందాలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జనవరి 7న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు.

**రాష్ట్ర స్థాయి పోటీలు ఇలా...**

జిల్లా స్థాయిల్లో పాల్గొన్న మండలాల బృందాల్లో ఒక్కటి ప్రభుత్వ, మరొకటి ప్రైవేట్ పాఠశాల నుంచి మొత్తం రెండు బృందాలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఫిబ్రవరి 10,11 లలో రాష్ట్ర స్థాయీ పోటీలను నిర్వహించనున్నారు.

**సిలబస్ ఇదీ**

పాఠశాల స్థాయిలో విద్యార్థులు జూన్ నుంచి అక్టోబరు నెలాఖరు వరకూ గల సైన్స్, సోషల్, గణితం సబ్జెక్టులను చదువుకుని పరీక్ష రాసారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో ఆయా సిలబస్‌లో రాత పరీక్షతో పాటు క్విజ్ పోటీ కూడా ఉంటుంది.

**చెకుముకి సంబరాల నేపథ్యమిదీ..**

మానవుల్లో అజ్ఞానాన్ని తొలగించేందుకు పలువురు మేధావులు, అభ్యుదయ కాముకులు 1988 ఫిబ్రవరి 28న జన విజ్ఞాన వేదికను ఏర్పాటు చేశారు. విద్యార్థి చెకుముకి పేరుతో 1990 డిసెంబరు నుంచి సైన్స్ అంశాలతో మాస పత్రికను నిర్వహిస్తూ టాలెంట్ టెస్ట్‌లను కూడా నిర్వహించేది. వ్యాపారమయమైన టాలెంట్ టెస్ట్‌ల సంస్కృతిని వ్యతిరేకిస్తూ 2010 నుంచి 'చెకుముకి సైన్స్ సంబరాలు'ను నిర్వహిస్తోంది. నేర్చుకున్నది గుర్తుండిపోవడం కాకుండా ఆచరించగలగడమే గీటురాయని చెప్పే లక్ష్యంతో ఈ సంబరాలను నిర్వహిస్తోంది. రాత పరీక్షతో పాటు క్విజ్, శాస్త్రవేత్తలతో విద్యార్థులను మమేకం చేసే దిశగా కార్యక్రమాలను రూపొందిస్తూ ముందుకు సాగుతుంది.

**సమాజానికి అంకితం చేయడమే లక్ష్యం**



విద్యార్థులు పాడైపోతున్నారంటూ చాలామంది వ్యాఖ్యానాలు చేస్తుంటారు. వాస్తవానికి ప్రతి విద్యార్థి సమాజంలోనే మసులుతాడు. అలాంటి విద్యార్థి సామాజిక అంవాలకు ప్రభావితమై జీవిస్తుంటాడు. సమాజంలోని రుగ్మతలకు అందరిలానే విద్యార్థి కూడా ప్రభావితం అవుతాడు. చేయాల్సింది విద్యార్థులను నిందించడం కాదు. సామాజిక రుగ్మతలను పారద్రోలే కార్యాచరణకు సిద్ధమవ్వాలి. ఆ పని జనవిజ్ఞాన వేదిక చేస్తుంది.

– డాక్టర్ చల్లా రవికుమార్, జేవీవీ రాష్ట్ర నాయకుడు, మండపేట

**ప్రశ్నించే తత్వాన్ని కలిగిస్తూ..**



మార్పునకు మార్గం ప్రశ్నించడం. అలా ప్రశ్నించడం తప్పు అని చెబుతూ తరతరాలుగా పూర్వీకులు విద్యార్థులకు చెబుతూ వస్తున్నారు. ప్రశ్నించడం ద్వారానే సామాజిక రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని మేము చెబుతున్నాం. విజ్ఞత గలిగిన వారంతా జేవీవీ బాటన నడుస్తూ సామాజిక సేవలో నిమగ్నమవుతున్నారు.

– వాసంశెట్టి శ్రీనివాస్, జేవీవీ మండల కార్యదర్శి, కపిలేశ్వరపురం

**మండల స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి**



నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నేడు మండల స్థాయీ చెకుముకి పరీక్షలు జరుగుతున్నాయి. మండపేట మండలంలో రూరల్ నుంచి 14, పట్టణం నుంచి 22 మొత్తం 36 బృందాలు పరీక్షలో పాల్గొంటున్నాయి. మధ్యాహ్నం పరీక్ష నిర్వహించి సాయంత్రం విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తాం

– గండి స్వామి ప్రసాద్, జేవీవీ అధ్యక్షులు, మండపేట మండల కమిటీ

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మండపేట సహకార సంఘంలో అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ ప్రతినిధులు

**కపిలేశ్వరపురం (మండపేట):** ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మండపేట వల్లూరి అప్పారావు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పెంకే గంగాధర్, మండపేట డీసీసీబీ బ్రాంచి నోడల్ అధికారి డి.ఏసు బాబు, మేనేజర్లు టి.రవికుమార్, ఎం.శంకరరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘ సభ్యులు పొదుపు, పెట్టుబడి, వడ్డీ తదితర అంశాలపై పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. మండపేట డీసీసీబీ బ్రాంచి అధికారులు ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. బ్యాంకు ద్వారా ప్రజలకు అందజేస్తున్న 555 రోజుల ప్రత్యేక డిపాజిట్ స్కీం, రైతు నేస్తం, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు తీరును వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొప్పిరెడ్డి కృష్ణ, సీఈఓ చీర్ల సుబ్రహ్మణ్యం, రైతులు తాడి రామారావు, శెట్టి నాగేశ్వరరావు, కుక్కల శ్రీనివాస్, వీలామంతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పసలపూడి



పసలపూడి శ్రీనివాస్

**కపిలేశ్వరపురం:** వైఎస్సార్ సీపీ బీసీ సెల్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడిగా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన పసలపూడి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈయన దీర్ఘకాలంగా వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. బీసీ సామాజికవర్గ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా శ్రీనివాస్ నియామకంపై నియోజకవర్గంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు. తనకు గుర్తింపు ఇచ్చిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు.

**విద్యార్థి విభాగం జిల్లా సహాయ కార్యదర్శిగా అబ్బిరెడ్డి**



అబ్బిరెడ్డి వీర్రాజు

**కపిలేశ్వరపురం (మండపేట):** వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం సహాయ కార్యదర్శిగా మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి వీర్రాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి తనకు ఉత్తర్వులు అందినట్టు వీర్రాజు బుధవారం తెలిపారు. తన నియామకంపై ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అడుగుజాడలో నడుస్తానన్నారు. తనకు తోడ్పాటునిచ్చిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వీర్రాజుకు పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీను, నాయకులు మన్నే భూషణం, అల్లంపల్లి కిశోర్, తుపాకుల ప్రసన్నకుమార్, చంద్రమళ్ళ లాజర్, యడ్ల రవి, ముక్కపాటి రాజు, పెదపాటి రెడ్డి రావు, కామిరెడ్డి ప్రసాద్, బందెల సాయిరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

## పీఎం స్వనిధిని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌కుమార్

**రామచంద్రపురం:** వీధి విక్రయదారులు సంఘాలుగా ఏర్పడి పీఎం స్వనిధి ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా జిల్లా అధికారి కె.మోహన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ వీధి విక్రయదారుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు డిజిటల్ ట్రాన్స్‌ఫర్ చేసిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా వీధి విక్రయదారుల కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకం కింద నమోదైన వీధి విక్రయదారులకు ఇబ్బందులు లేకుండా పట్టణంలో గ్రీన్, రెడ్, ఎల్లో జోన్‌లుగా విభజించి ప్రజలను ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ఐ అరుణ మాట్లాడుతూ వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి రుణాలు సీఐజీ గ్రూప్స్‌కు బ్యాంక్ లింకేజ్‌పై అన్ని విధాలు తోడ్పాటును ఇస్తామన్నారు. పీఎం స్వనిధి ద్వారా లబ్ధిపొంది అన్ని రకాల ఇన్సూరెన్సు స్కీమ్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ దుర్గాప్రసాద్, మెప్మా పట్టణ కో ఆర్డినేటర్ ఓ మంగాదేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ మహాలక్ష్మి, తదితర అధికారులు సంఘాల సభ్యులు వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



విజేతలకు ప్రసంసాపత్రాలు అందిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

**కె.గంగవరం:** ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించాలని కోరారు. వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరిగి సొంతంగా ప్రాజెక్టులు తయారు చేసే స్థితికి చేరుతారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించి వారికి సూచనలు చేశారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచి ప్రాజెక్టులు ఈ నెల 22, 23 తేదీల్లో రామచంద్రపురంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సైన్స్ కన్వీనర్ ప్రక్కి బ్రహ్మానందం, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, జి.వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ మేట్‌లకు శిక్షణ



ఉపాధి హామీ మేట్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో నరేంద్రరెడ్డి

**రాయవరం:** ఉపాధి హామీ పథకంలో మేట్‌లుగా పనిచేస్తున్న వారికి బుధవారం రాయవరంలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. మండలంలోని 12 పంచాయతీల పరిధిలో 120 మంది మేట్లకు గాను తొలి రోజు 60 మందికి శిక్షణ నిచ్చారు. ఈ శిక్షణలో భాగంగా వర్క్ డిమాండ్ ఎలా ఇవ్వాలి? మస్టర్లు ఏ విధంగా అమలు చేయాలి?పీఎంఎస్‌బీవై..మార్క్ అవుట్ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. శిక్షణ ప్రారంభానికి ముందు ఉపాధి ఏపీవో జె.సుధారాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఉపాధి హామీ కూలీకి పని కల్పించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ట్రైనింగ్ అనంతరం మేట్స్‌కు సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, జేఈఈ ఈశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

## పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం



పామర్రు క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

**కె.గంగవరం:** పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఈ క్రీడా మైదానంలో నిర్వహిస్తారన్నారు. ఆటలు ఆడడానికి వీలుగా లేకపోవడంతో పూర్వ విద్యార్థులు సొమ్ములు వెచ్చించి పూస కంకరతో మైదానాన్ని వీలుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్‌యం పుల్లయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసు, గ్రామ పెద్దలు వాసంశెట్టి సూరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాల బాలాజీ సన్నిధిలో సాయికుమార్



**మామిడికుదురు:** అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ పేర్కొన్నారు. ఆయన బుధవారం అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేదాశీర్వచాలు అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు సాయికుమార్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

సినీ నటుడు సాయికుమార్‌కు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మన్ రామకృష్ణ

### నగదు చోరీపై కేసు

**కొత్తపేట:** నగదు చోరీపై కేసు నమోదు చేసినట్టు కొత్తపేట ఎస్సై డి.జ్వాలసాగర్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పలివెల గ్రామంలో పి.జి కాలేజీ సమీపంలో నివాసముంటున్న యల్లమెల్లి రత్నాజీ తన కుటుంబ సభ్యులతో ఈ నెల 12వ తేదీన పెళ్లి నిమిత్తం రాజమండ్రి బంధువుల ఇంటికి వెళ్లాడు. అనంతరం బుధవారం ఉదయం రాజమండ్రి నుంచి ఇంటికి వచ్చేసరికి తాళాలు బద్దలు కొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో బీరువాలో పెట్టిన నగదు రెండు లక్షల రూపాయలు కనిపించకుండా పోయాయి.దీనిపై బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ఆక్రమణల తొలగింపు

**సఖినేటిపల్లి:** అంతర్వేది దేవస్థానం పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డులోని ఆక్రమణలను బుధవారం పంచాయతీ సిబ్బంది జేసీబీ ద్వారా తొలగించే పనులు చేపట్టారు. పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారిలోని ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో పంచాయతీ ఈ చర్యలు చేపట్టింది. సర్పంచ్ కొండా జాన్‌బాబు ఆధ్వర్యంలో కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో ప్రసాద్ పనులను పర్యవేక్షించారు.

### విద్యుత్ వనరులపై అవగాహన

**ఆత్రేయపురం:** స్థానిక మహాత్మాగాంధీ కళాశాల వద్ద బుధవారం విద్యుత్ వారోత్సవాలపై ఎలక్ట్రికల్ ఏఈ బాపిరాజు, సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యుత్‌కు అవసరమైయ్యే వనరుల అభివృద్ధి, వాటి వినియోగం , భవిష్యత్ తరాలు ఏవిధంగా ఉండాలో అవగాహన కల్పించారు.

### నేడు మంత్రి వేణు ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు

**రామచంద్రపురం రూరల్:** రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం ఉదయం 9 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొంటారని మంత్రి అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు రామచంద్రపురం పట్టణంలోని చాకలిపేట హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ పంపిణీలో పాల్గొంటారన్నారు.

### ప్రగతి పథంలో మహిళలే కీలకం



అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

**రామచంద్రపురం:** రాష్ట్రం ప్రగతి పథంలో మహిళలే కీలకమని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పట్టణ పరస్పర సహాయక సహకర సమాఖ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు తమ ఉత్పత్తులను విక్రయించారు. చీరలు ఫ్యాన్సీ వస్తువులు, గృహోపకరణ వస్తువులు, తదితర వస్తువులను విక్రయించారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా జిల్లా అధికారి కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

### ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



వెదురుమూడిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, బీజేపీ నేతలు

**కపిలేశ్వరపురం (మండపేట):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని వెదురుమూడిలో అవగాహన సమావేశం నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి వెలగల లక్ష్మి, హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎన్ మూర్తి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ చేతుల మీదుగా 'నవ సంకల్పం వికసిత భారత్' క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

### విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

**రామచంద్రపురం:** ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రామచంద్రపురం డివిజన్‌లో విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ చిత్రలేఖన పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలో డివిజన్ పరిధిలో వివిధ పాఠశాలల నుంచి సుమారుగా 160 మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు డీఈ వై.విజయానంద్ బహుమతులను అందజేశారు. డీఈ కె.మురళీ మోహన్ టౌన్ ఏఈ శ్రీ మేడిశెట్టి వెంకట రమణ, టెక్నికల్ ఎస్కే నజీర్ ఖాన్,జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా సహదేవ్

**సఖినేటిపల్లి:** మండల పరిధిలోని ఉయ్యూరువారి మెరకకు చెందిన తాడి సహదేవ్‌ను వైఎస్సార్ సీపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బుధవారం నియమించారు. ఈ మేరకు తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడినట్టు ఆయన తెలిపారు. విద్యార్థి విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన సహదేవ్‌ను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభినందించారు.

### అంతర్వేది గోశాలకు వితరణ

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని గోశాలకు బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కుమార్ రైస్ ఇండస్ట్రీస్ అధినేత దేవరపు ఆనందబాబు దాణా వితరణ చేశారు. సుమారు రూ.13,500 విలువ గల 50 కేజీల తవుడును గోశాలకు ఇచ్చారు. ఆ బస్తాలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. అర్చకులు, స్వామివారి సేవా బృందం సభ్యులు, గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

### అయినవిల్లిలో క్రిస్మస్

**అయినవిల్లి:** పరలోక అగ్ని అపోస్తలిక్‌మినిస్ట్రీ ఆధ్వర్యంలో అయినవిల్లి పెదపేటలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. పాస్టర్స్ జ్యోతిబాబు, ఎస్.పాల్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు.